నగరంలో రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం

కంఠేశ్వర్, ఆగస్టు 6: అలీసాగర్ మెయిన్ పైప్ లీకేజీ కారణంగా నగరంలో ఈ నెల 7, 8వ తేదీల్లో రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాల కమిషనర్ మకరంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా 17 వాటర్ ట్యాంకర్లను నీటి సరఫరాకు ఉపయోగిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

సొంతఖర్చుతో రోడ్డు మరమ్మతులు

ధర్పల్లి, ఆగస్టు 6 : ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా వద్ద రోడ్డు పూర్తిగా గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో ప్రతిరోజు ఈ రోడ్డు వెంట గ్రామస్తులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ తన సొంత ఖర్చులతో రోడ్డుకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డు బాగు కావడంతో ప్రజలు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు చెలిమెల శ్రీనివాస్, చెలిమెల నర్సయ్య, అబ్దుల్ హమీద్, చెలిమెల చిన్నారెడ్డి, గోపి, నరేందర్, రమణ పాల్గొన్నారు.

'తులం బంగారం' అమలుచేయాలి

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక్‌నగర్, ఆగస్టు 6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌భవన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని డీపీవో తరుణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి, నగదు ప్రోత్సాహం అందజేశారు.

–చందూర్,ఆగస్టు 6

'సార్'కు ఘన నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాలు, గ్రామాల్లో జయశంకర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని ధారపోసారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. బాల్కొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. - నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 6

జిల్లా కేంద్రంలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న నగర మేయర్ నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

సీపీ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

తెలంగాణ యూనివర్సిటీలో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

నవీపేటలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేస్తున్న జనవికాస సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి తదితరులు

రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలి

శక్కర్‌నగర్, ఆగస్టు 6: అర్హులై ఉండి రుణమాఫీ డబ్బులు రాని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు బీఆర్‌ఎస్ కార్మిక సంఘం, యువజన సంఘం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, జక్కు సంజు పటేల్ వినతిపత్రం అందజేశారు. రైతుల ఇబ్బందులను వివరించారు. అర్హులైన పలువురు రైతులకు రూ.లక్ష కూడా రుణమాఫీ కాలేదని, ఇందుకు పలువురు అధికారులు వద్దకు వెళితే సరైన సమాధానం లభించడం లేదని అన్నారు. ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల ఫోన్ నంబర్లు కూడా కలవడం లేదని అన్నారు. రైతులకు రుణమాఫీ జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింమానాయుడు మంగళవారం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి స్వగృహంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో ఉంటున్న తెలంగాణ వాసుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

అక్రమ క్రషర్‌ను నిలిపివేయండి

జక్రాన్‌పల్లి, ఆగస్టు 6 : మండలంలోని లక్ష్మాపూర్ గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన స్టోన్ అండ్ మైనింగ్ క్రషర్‌ను వెంటనే నిలిపివేసి విచారణ జరిపించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త కెఆర్.సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. గతంలో జిల్లా కలెక్టర్‌కు క్వారీ విషయంలో ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

విత్తనాలు కొనుగోలు చేయాలి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

సారంగాపూర్, ఆగస్టు 6 : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ తయారుచేస్తున్న విత్తనాలను కొనుగోలు చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఆయన సారంగాపూర్, ఆర్మూర్‌లో అధికారులు, రైతులతో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. రైతులు బాగుండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ అభివృద్ధికి రైతులు సూచనలు చేయాలని కోరారు. అంతకుముందు ఆయన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు.

-వినాయక్‌నగర్, ఆగస్టు 6

తల్లిపాల వారోత్సవాలు

డిచ్‌పలి/ ఇందల్వాయి/పొతంగల్/ కంఠేశ్వర్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలోని గంగస్థాన్–2లో ఉన్న వివేకానంద ధ్యాన మందిరంతోపాటు డిచ్‌పల్లి, ఇందల్వాయి, పొతంగల్ మండలాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

సైబర్ క్రైమ్ పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న రాజ్ భీమిడి రెడ్డి

కంఠేశ్వర్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. సేఫ్‌టీన్స్ ఆన్‌లైన్ నాన్ ప్రాఫిటేబుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చెందిన మాస్టర్ రాజ్ భీమిడి రెడ్డి నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. అమెరికాలో పదో తరగతి చదువుతూ సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజ్ భీమిడి రెడ్డిని పలువురు అభినందించారు.

సంక్షిప్తంగా..

● **పీవోడబ్ల్యూ నూతన కార్యవర్గం ఏర్పాటు:** ఖలీల్‌వాడి(మోపాల్), ఆగస్టు 6: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పీవోడబ్ల్యూ ఏడో మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షురాలుగా వేల్పూర్ లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాధ, సహాయ కార్యదర్శిగా రజిత, కోశాధికారిగా అనూజ, సభ్యులుగా బండమీద లత, శైలజ, రాణి, సరోజన, నీలం లక్ష్మి, సంజనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

● **టెక్నికల్ కళాశాల తనిఖీ-** నవీపేట,ఆగస్టు6: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రిన్సిపాల్ గంగాధర్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ నారాయణ, సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

● **నైపుణ్యాలను పెంపొందించుకోవాలి:** డిచ్‌పల్లి, ఆగస్టు 6 : టీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్‌లో భాగంగా మంగళవారం మూవీ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈవెంట్ మెంటర్ ఆచార్య సీహెచ్.ఆంజనేయులు మాట్లాడుతూ..ఎంబీఏ విద్యార్థులు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆచార్యులు కైసర్, అపర్ణ, వాణి పాల్గొన్నారు. ఈవెంట్ మేనేజర్లుగా హరినాథ్‌రెడ్డి, భాగ్యశ్రీ, అభిలాష్ వ్యవహరించారు.

● **పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా భార్గవ్ :** ఇందల్వాయి, ఆగస్టు 6: పీఆర్టీయూ నూతన మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పి.భార్గవ్, ప్రధాన కార్యదర్శిగా పి. శ్రీనివాస్, సభ్యులుగా కె.విజయరాం, సీహెచ్.శ్యామల, వంశీకృష్ణ, ఎస్.స్రవంతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడికి పీఆర్టీయూ జిల్లా నాయకులు నియామక పత్రాన్ని అందజేశారు.

● **మండల కమిటీలు చెల్లవు:** ఖలీల్‌వాడి, ఆగస్టు 6: పదవీ కాలం ముగిసిన మండల కమిటీలు చెల్లవని ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు అర్వపల్లి పురుషోత్తం గుప్తా అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మోటూరి మురళీగుప్తా పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌లో ముగిసిందని, ప్రస్తుతం మండల కమిటీలు ఏర్పాటు చేయడం సరి కాదన్నారు.

● **'రుణమాఫీ' దరఖాస్తుల స్వీకరణ:** రుద్రూర్, ఆగస్టు 6: మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి శ్రావణి మంగళవారం తెలిపారు. మొదటి, రెండో విడుతల్లో రుణమాఫీ కాని అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకొని రైతు వేదికలో ఇవ్వాలని సూచించారు.

● **16న వరలక్ష్మి వ్రతం :** సుభాష్‌నగర్, ఆగస్టు 6: శ్రావణమాసం పురస్కరించుకొని కిషన్ గంజ్ శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రతి శ్రావణ మంగళవారం మంగళ గౌరీ వ్రతం, ఈ నెల 16న వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్‌గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 20, 27వ తేదీల్లో మంగళగౌరీ వ్రతాలు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● **నేడు ఎమ్మెల్యే పర్యటన-** మోర్తాడ్, ఆగస్టు6: మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఉదయం 9గంటలకు ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మీకాలువ, కాకతీయకాలువకు నీటిని విడుదల చేస్తారు. 10.30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

● **లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి-** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించినట్లు ఏడీఈ రాజేశ్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

● **పల్లెప్రకృతి వనం పరిశీలన -** బాల్కొండ, ఆగస్టు 6: కిసాన్‌నగర్‌లోని పల్లెప్రకృతి వనాన్ని మంగళవారం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శ్రీధర్ సందర్శించారు. పల్లెప్రకృతివనంలో పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రేణుకాదేవి, కారోబార్ గణేశ్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజనర్సయ్య పాల్గొన్నారు.

● **రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం-** బోధన్ రూరల్, ఆగస్టు6: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా శివారులోని రెండు ట్రాన్స్‌పార్మర్లను దుండగులు ధ్వంసం చేశారని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయిల్ ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

● **పంట సర్వే పరిశీలన -** బోధన్ రూరల్, ఆగస్టు6: బోధన్ మండలంలోని అమ్దాపూర్, కల్దుర్కి గ్రామాల్లో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, బోధన్ ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్‌నాయక్‌తో కలిసి పంట సర్వేను పరిశీలించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

●**పేకాట స్థావరంపై మెరుపు దాడి-** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: కోటార్మూర్‌లోని ఓ ఇంట్లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కృష్ణమూర్తి మంగళవారం దాడి చేశారు. పేకాడుతున్న ఎనిమిది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.67,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట రాయుళ్లను ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● **విరాళాల సేకరణ–** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: కేరళ వరద బాధితుల కోసం మంగళవారం పట్టణంలో విరాళాలు సేకరించినట్లు సీపీఎం నాయకుడు వెంకటేశ్ తెలిపారు.

● **గద్దర్‌కు నివాళి -** నందిపేట్, ఆగస్టు 6: మండల కేంద్రంలో ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సభ నిర్వహించారు. కళాకారులు గంగాధర్, దేవన్న, మల్లయ్య, సతీశ్, నాగభూషణ్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

●**పీడీఎస్ బియ్యం పట్టివేత-** మోర్తాడ్, ఆగస్టు6: మోర్తాడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 150.50క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వోడీ ఏఎస్‌వో శ్రీధర్‌రెడ్డి టీం మంగళవారం పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వోడీ ఏఎస్‌వో తెలిపారు.

● **సన్మానం -** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన బస్వారెడ్డిని పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో జీజీ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

బాల్కొండలోని ఫిల్టర్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ, ఆగస్టు6: ఆర్మూర్ పట్టణంలోతాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద ఉన్న తాగునీటి ట్యాంకును ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పలు ట్యాంకులను పరిశీలించామని అన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ లావణ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.అంకాపూర్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తన స్వగృహంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించిన తాగునీటి ఫిల్టర్ హౌస్‌ను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వేల్పూర్/రెంజల్,ఆగస్టు6: ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సన్మానించారు. హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ హరిత పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తి తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరు ఉపాధ్యాయులను జమీయత్ ఉల్మామా ఆధ్వర్యంలో సన్మానించారు. ఉద్యోగోన్నతి పొందిన హెచ్‌ఎం సయ్యద్ అత్తర్, స్కూల్ అసిస్టెంట్ జాకీర్ అహ్మద్‌ను నీలా విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్, జమీయత్ ఉల్మా మండల అధ్యక్షుడు ముఫ్తీ అబీద్‌బేగ్ శాలువాతో సన్మానించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మాక్లూర్/మోర్తాడ్/భీమ్‌గల్/బాల్కొండ/ఆర్మూర్‌టౌన్/ రెంజల్/ ఎడపల్లి/ బోధన్ రూరల్/ ఆలూర్/ ధర్పల్లి/ మోస్రా (చందూర్)/ఇందల్వాయి, ఆగస్టు6: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం ఆయన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనులను పరిశీలించారు. ఆలూర్ పాఠశాల నుంచి 14 మంది బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంతో హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులను అభినందించారు. మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామంలో మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగానారి విఠల్‌రావు హాజరై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు.

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో మండల ప్రత్యేకాధికారులు సాయాగౌడ్, మధుసూదన్, ఎంపీడీవోలు రాజశ్రీనివాస్, తిరుమల, ఎంపీవో శ్రీధర్, ఏపీవోలు విద్యానంద్, శకుంతల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. భీమ్‌గల్ పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ, లింగాపూర్, బెజ్జోరా గ్రామాల్లో గ్రామాల్లో గ్రామస్తులు, సంబంధిత అధికారులకు ఎంపీడీవో సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పల్లికొండ ప్రాథమిక పాఠశాలలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు. బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్, జలాల్‌పూర్, నాగపూర్, బస్సాపూర్ గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీవో గంగామోహన్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఉపాధిహామీ ఏపీవో ఇందిర, టీఏ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మానస ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ మొక్కలు నాటారు. స్పెషల్ ఆఫీసర్ హరీశ్ కుమార్, సెక్రటరీ సుకన్య రెడ్డి, వీఆర్వో రాజేశ్వర్, కారోబర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని మినార్‌పల్లి, భవానీపేట్ గ్రామాలల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి (మండల ప్రత్యేక అధికారి)తరుణ్ కుమార్ పరిశీలించారు. ఎంపీవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని కూనేపల్లిలో మొక్కలు నాటారు. ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్, కుర్నాపల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి తహసీల్దార్ దన్వాల్ మొక్కలు నాటారు. ధర్పల్లి మండలంలోని ప్రాజెక్టు రామడ్గు, కేశారం, మైలారం, సల్లగరిగె, దుబ్బాక, రేకులపల్లి, ఎస్‌బీ తండా, దమ్మన్నపేట్ తదితర గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి, నిజామాబాద్ డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో బాలకృష్ణ మంగళవారం పర్యటించారు.అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి త్వరగాపూర్తిచేయాలని సూచించారు. అనంతరం పల గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటించారు. చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో డీఎల్పీవో మధుకర్ పర్యటించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో చెత్తచెదారంతోపాటు పిచ్చిమొక్కలను తొలగించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు ఎంపీడీవో అనంతరావును కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రాజ్‌కాంత్‌రావు, కార్యదర్శి పాల్గొన్నారు.

ఆలూర్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

గోవింద్‌పేట్‌లో మొక్క నాటుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

'బాగేపల్లికి బస్సు నడపాలి'

రెంజల్, ఆగస్టు 6: నిజామాబాద్ నుంచి బాగేపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ మంగళవారం బాగేపల్లి తాజా మాజీ సర్పంచ్ సాయిలు, వీడీసీ సభ్యులు ఆర్‌ఎం జాన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బాగేపల్లి, కూనేపల్లి, కళ్యాపూర్, కిసాన్‌తండా గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా వెళ్తున్నారని అన్నారు. వీడీసీ అధ్యక్షుడు సాయిలు, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ గోపాల్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం టెన్త్ 2001–02 బ్యాచ్ విద్యార్థులు స్పోర్ట్ దుస్తులు పంపిణీ చేశారు. అన్ని తరగతులకు చెందిన 99 మంది విద్యార్థులకు దుస్తులు అందజేశారు. హెచ్‌ఎం రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. – బాల్కొండ, ఆగస్టు 6

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలో అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు ఆరెపల్లి సాయిలు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆపార్టీ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ అధికారులు అనేక రకాలుగా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నందిపేట్ మండలంలోని కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ భక్తబృందంతో కలిసి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులో వెళ్లారు.

–నందిపేట్, ఆగస్టు6

'జాగృతి' నాయకుడు నర్సింహులు కన్నుమూత

నర్సింహులు (ఫైల్)

బోధన్, ఆగస్టు 6: పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ జాగృతి నాయకుడు కొట్టూర్ నర్సింహులు(75) మంగళవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. 1969లో విద్యార్థి దశలోనే ఆయన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2009 నుంచి ప్రారంభమైన తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. బోధన్‌లో 1519 రోజులపాటు కొనసాగిన నిరాహారదీక్షల నిర్వహణలో తన వంతు పాత్ర పోషించారు. సుమారు పదేళ్లపాటు తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న ఆయన 2006లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మృతికి బోధన్ జేఏసీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, తెలంగాణ జాగృతి నాయకులు, సంతాపం ప్రకటించారు. నర్సింహులు అంత్యక్రియలు బోధన్ ఆజాంగంజ్‌లోని ఆయన స్వగృహం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 6: నగర శివారులోని అర్సపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆరో టౌన్ ఎస్సై మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన పోతురు మల్లయ్య (62)కు మతిస్థిమితం లేకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. సోమవారం రాత్రి అర్సపల్లి బైపాస్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి చిన్నకుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం లభించలేదని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు

నీటి కుళాయికి పంపు మోటర్ పెట్టే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి చెందారు. నాందేవ్‌వాడకు చెందిన శ్రీనివాస్(45) ఇంటి ముందు ఉన్న నీటి కుళాయికి మోటర్ బిగించే సమయంలో ఆకస్మాతుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి స్పృహతప్పి పడిపోయాడు. గమనించి కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ ఇన్‌చార్జి ఎస్సై నర్సయ్య తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

వినాయక్‌నగర్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలోని శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆఫీస్ తాళం ధ్వంసం చేసి దొంగతనానికి పాల్పడ్డారు.మంగళవారం ఉదయం పాఠశాల తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి హెచ్‌ఎంకు సమాచారమిచ్చారు.దీంతో ఆయన వచ్చి పరిశీలించగా ఆఫీస్ గదిలో నుంచి రెండు ట్యాబ్‌లు అపహరణకు గురైనట్లు గుర్తించి, రెండోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, SANTHA VASANTHA, W/o. Santha Ganga Reddy, R/o. H.No. 5-42/10, Bussapur (Vi.), Mendora (Mdl.), Nizamabad (Dist.)-503 218, Telangana, have Changed My Name from SANTHA VASANTHA to ARUGUMEEDI VASANTHA for all Records purpose.
NT-98124

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.